క్లుప్తంగా

నేడు రిటైర్డ్ ఉద్యోగుల ప్రొటెస్ట్ డే

హన్మకొండ: సేవ్ పెన్షన్ నినాదంతో ఈనెల 3న ప్రొటెస్ట్ డే కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ హనుమకొండ అధ్యక్షుడు సిరిమల్ల సదానందం, కార్యదర్శి చాడా జయహింద్ రెడ్డి తెలిపారు. ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్, ఆలిండియా రిటైర్డ్ రైల్వే మెన్స్ ఫెడరేషన్ పిలుపులో భాగంగా గురువారం ఉదయం హనుమకొండలోని హెడ్ పోస్టాఫీస్ ఎదుట ప్రొటెస్ట్ డే నిర్వహించనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో వివరించారు. ఉద్యోగ, కార్మిక వ్యతిరేక విధానాలను కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తోందని పేర్కొన్నారు. పాత పెన్షన్ కొనసాగించాలని పెన్షనర్లు ఉద్యమించాలని సూచించారు.

గ్రూప్ -1 విజేతకు సన్మానం



రామన్నపేట: నగరంలోని వరంగల్ పాలిటెక్నిక్ కళాశాలలో 2015 – 2018 బ్యాచ్ మెకానికల్ ఇంజనీరింగ్ పూర్తి చేసిన ఐనవోలు మండలం పున్నేలుకు చెందిన పూర్వ విద్యార్థి మహ్మద్ విలాయత్ అలీ ఇటీవల టీజీపీఎస్సీ ప్రకటించిన గ్రూప్ -1 ఫలితాల్లో రాష్ట్ర స్థాయి 86వ ర్యాంక్, బీసీ -ఈ కేటగిరిలో రాష్ట్రస్థాయి 2వ ర్యాంక్, జోన్ స్థాయిలో 1వ ర్యాంక్ సాధించారు. దాంతో ఆయనను కళాశాల ప్రిన్సిపాల్ బైరి ప్రభాకర్, మెకానికల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి ఎం.వెంకన్న, అధ్యాపకులు బుధవారం సన్మానించారు.

శారదకు డాక్టరేట్



కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ తెలుగు విభాగం పరిశోధకురాలు తోట శారదకు యూనివర్సిటీ డాక్టరేట్ ప్రకటించింది. ఐత చంద్రయ్య సాహిత్యం – సమగ్ర పరిశీలన అనే అంశంపై సమర్పించిన పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథానికి శారదకు డాక్టరేట్ ప్రదానం చేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ రాజేందర్ తెలిపారు. హనుమకొండలోని కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలుగు విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ రమేష్ పర్యవేక్షణలో శారద తన పీహెచ్‌డీ పూర్తిచేశారు.

కిట్స్ అధ్యాపకుడికి డాక్టరేట్



హసన్‌పర్తి: కిట్స్ కళాశాల సీఎస్ఈ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్న బి.రాజు.. డాక్టరేట్ అందుకున్నారు. 'ఎన్‌హాన్స్‌డ్ డీప్ లర్నింగ్ మోడల్ ఫర్ సెంటిమెంట్ అనలసిస్ టు ఆగ్మెంట్ కన్స్యూమర్ ఎక్స్‌పీరియన్స్ ఆన్ ఇ – కామర్స్ ప్లాట్‌ఫామ్స్' అనే అంశంపై సమర్పించిన పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథానికి చెన్నైలోని డీమ్డ్ టు బీ యూనివర్సిటీ డాక్టరేట్ అందజేసింది. డాక్టర్ సెల్వప్రియ పర్యవేక్షణలో రాజు తన పీహెచ్‌డీ పూర్తిచేశారు.

అనుమతి లేని ఫ్లెక్సీల తొలగింపు

కాజీపేట: కాజీపేట పట్టణంలో అడుగడుగునా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను గ్రేటర్ వరంగల్ మున్సిపాలిటీకి చెందిన సిబ్బంది బుధవారం తొలగించారు. అనుమతి పొందకుండా ఇష్టారీతిగా పట్టణంలోని పుర వీధుల్లో ఉగాది, శ్రీరామ నవమి, ఈస్టర్ శుభాకాంక్షలు తెలుపుతూ ఏర్పాటు చేశారు. అనేక మంది ఫిర్యాదు చేయడంతో మున్సిపల్ అధికారులు స్పందించి ప్రమాదకరంగా మారిన ఫ్లెక్సీలను తొలగించినందుకు పట్టణ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

డంపింగ్ యార్డు సమస్య పరిష్కరించాలని వినతి

మడికొండ: మడికొండ – రాంపూర్ గ్రామాల మధ్య ఉన్న డంపింగ్ యార్డుతో చుట్టపక్కల పది గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అడ్‌హక్ కమిటీ సభ్యులు అన్నారు. ఈమేరకు డంపింగ్ యార్డు సమస్యను పరిష్కరించాలని కోరుతూ నగరంలోని కాలుష్య నియంత్రణ కార్యాలయంలో ఈఈ సునీతకు బుధవారం వినతిపత్రం అందజేశారు. అనంతరం కాజీపేట ఏసీపీ తిరుమల్‌ను కలిసి డంపింగ్ యార్డు సమస్యపై ఈనెల 7 నుంచి 9వ తేదీ వరకు రిలే నిరాహార దీక్షల కోసం అనుమతి కోరారు.

అంతర్ జిల్లా దొంగ అరెస్ట్



మడికొండ: అంతర్ జిల్లా దొంగను అరెస్ట్ చేసి రిమాండ్ తరలించినట్లు మడికొండ ఇన్‌స్పెక్టర్ పులాల కిషన్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం మడికొండలో బుధవారం తనిఖీలు చేస్తుండగా అనుమానాస్పదంగా తిరుగుతున్న సికింద్రాబాద్‌కు చెందిన కనక రాజు శ్రీధర్‌ను అదుపులోకి తీసుకొని విచారించగా అతడి వద్ద నుంచి నల్లపూసల తాడు, బంగారు చైన్, డైమండ్ లాకెట్ చైన్, 60గ్రాముల బంగారం లభించింది. ఈ సందర్భంగా దొంగను పట్టుకున్న ఎస్సై రాజ్‌కుమార్, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్లు బాలజీ వరప్రసాద్, రఘు, పోలీసు సిబ్బందిని సీపీ అభినందించారు.

ఈ దారి.. పూలదారి

- కాగితపు పూలతో ఆకట్టుకుంటున్న మడికొండ – రాంపూర్ జాతీయ రహదారి

గ్రేటర్ వరంగల్ నగరంలో మడికొండ నుంచి రాంపూర్ వరకు ఉన్న జాతీయ రహదారి డివైడర్ మధ్యలో పూల చెట్లు ఏపుగా పెరిగి కనువిందు చేస్తున్నాయి. గ్రేటర్ వరంగల్ ఆధ్వర్యంలో అభివృద్ధి పనుల్లో భాగంగా మడికొండ, రాంపూర్ మీదుగా స్టేషన్ పెండ్యాల వరకు రకరకాల చెట్లు, కాగితపు పూల మొక్కలను గతంలో నాటారు. అవి ఇప్పుడు చెట్లుగా ఎదిగి రంగురంగుల పూలు పూస్తూ వాహనదారులు, ప్రయాణికులు, పాదచారులను ఆకట్టుకుంటున్నాయి.

– మడికొండ





కుంభాభిషేక పూజలు ప్రారంభం

ఖిలా వరంగల్: వరంగల్ శివనగర్‌లోని సీతారామ చంద్ర స్వామి ఆలయ ప్రాంగణంలో కుంభాభిషేక మహోత్సవ పూజలు వైభవంగా ప్రారంభమయ్యాయి. మైసూర్ దత్తపీఠం ఉత్తరాధికారి విజయానందతీర్థ స్వామి శిష్య బృందం ఆధ్వర్యంలో బుధవారం నుంచి శుక్రవారం వరకు జరగనున్న మహాగణపతి, సుబ్రహ్మణ్య, లలితాదేవి, రామలింగేశ్వర స్వామి, పంచముఖాంజనేయ సహిత సీతారామ చంద్ర స్వామికి పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో మహిళలు సామూహిక లలితా సహస్రనామ స్తోత్రం పారాయణం, కుంకుమార్చన పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ ట్రస్టు ప్రతినిధులు వడ్నాల మల్లయ్య, మంచాల కృష్ణమూర్తి, చింతం యాదగిరి, శ్రీరాంరాజేష్,



రామాలయంలో పూజలు చేస్తున్న భక్తులు

బత్తుల నవీన్, బుదారపు భాస్కర్, ఆడెపు సాంబమూర్తి, కుడికాల సుధాకర్, కొండి రాజమౌళి, కొత్తగట్టు నరసింహమూర్తి, డాక్టర్ పొన్న దశరథం, మీసా సత్యనారాయణ, శామంతుల భిక్షపతి, రావికంటి అశోక్, నాయిని అనిల్ పాల్గొన్నారు.

అవగాహనతో ఆటిజాన్ని నివారించవచ్చు



ర్యాలీలో మనోవికాస కేంద్రం దివ్యాంగ విద్యార్థులు

హన్మకొండ: అవగాహన కార్యక్రమాలతో ఆటిజంను నివారించవచ్చని కాకతీయ విశ్వవిద్యాలయ పాలక మండలి సభ్యురాలు, వరల్డ్ వైజ్ కన్స్యూమర్ రైట్స్ అండ్ ప్రొటెక్షన్ జాతీయ వైస్ చైర్మన్ కరుకాల అనితారెడ్డి అన్నారు. ప్రపంచ ఆటిజం అవగాహన దినోత్సవం సందర్భంగా మల్లికాంబ మనోవికాస కేంద్రం ఆధ్వర్యంలో హనుమకొండలోని పబ్లిక్ గార్డెన్ నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు బుధవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వయస్సుకు తగ్గ ఎదుగుదల లేకుండా పుట్టిన పిల్లల్లో ఆటిజం లక్షణాలు ఉంటాయని అన్నారు. ప్రస్తుత కాలంలో గర్భం దాల్చిన సమయంలో అధిక ఒత్తిడితో, మేనరికం వంటి దగ్గర సంబంధాలు చేసుకోవడం, మానసిక ఎదుగుదల లోపాల కారణంగా చాలా మంది పిల్లలు మేధో సంబంధ సమస్యలతో బాధపడుతున్నారని అన్నారు. వైద్యుల సలహా మేరకు ప్రత్యేక శిక్షణ ద్వారా మార్పు తీసుకొని రావచ్చన్నారు. మల్లికాంబ మనోవికాస కేంద్రం వ్యవస్థాపకురాలు బండ రామలీల, దివ్యాంగ విద్యార్థులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ సభను విజయవంతం చేయాలి

హన్మకొండ: బీఆర్ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేయాలని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు పిలుపునిచ్చారు. హనుమకొండ రాంనగర్‌లోని స్వగృహంలో వర్ధన్నపేట నియోజకవర్గానికి చెందిన వరంగల్ మహానగర పాలక సంస్థ పరిధిలోని 13 డివిజన్, హసన్‌పర్తి మండల బీఆర్ఎస్ ముఖ్య నాయకుల సమావేశం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీ స్థాపించి 25 ఏళ్లు అవుతున్న సందర్భంగా హనుమకొండ జిల్లా ఎలకతుర్తిలో రజతోత్సవ సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సభకు భారీగా జనాన్ని సమీకరించాలని కార్యకర్తలకు సూచించారు. అనంతరం డివిజన్‌ల వారీగా ఇన్‌చార్జ్‌లను ప్రకటించారు.



సమావేశంలో మాట్లాడుతున్న దయాకర్ రావు

బీఆర్ఎస్ నాయకులు ఎల్లావుల లలితాయాదవ్, రాధికారెడ్డి, రాజునాయక్, జోరిక రమేష్, చింతల యాదగిరి, బుద్దె వెంకన్న, పోలెపల్లి రామ్మూర్తి, నరెడ్ల శ్రీధర్, కొండపాక రఘు, జయపాల్ రెడ్డి, రాజశేఖర్, నేరెళ్ల రాజు, దండు అశోక్ యాదవ్, సాను ధనుంజయ్ పాల్గొన్నారు.

మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం



మడికొండ: రేషన్ షాపుల్లో సన్న బియ్యం పంపిణీ చేస్తున్న క్రమంలో ప్రధాని మోడీ చిత్రపటానికి భారతీయ జనతా పార్టీ నాయకులు బుధవారం క్షీరాభిషేకం చేశారు. ఈ క్రమంలో వరంగల్ జిల్లా కౌన్సిల్ సభ్యుడు దువ్వ నవీన్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఒక్కరికి 5 కిలోల చొప్పున ఐదేళ్లుగా ఇస్తోందని, కేవలం ఒక్క కిలో బియ్యం మాత్రమే రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్నట్లు తెలిపారు. పార్టీ వర్ధన్నపేట కోకన్వీనర్ రవీందర్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు ఆకుల శ్రీకాంత్, కుమార్‌బాబు, కుక్కల రాకేష్, నాని, అమరేందర్, సాయి పాల్గొన్నారు.

ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలి



వరంగల్ చౌరస్తా: ఆపరేషన్ కగార్‌ను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే నిలిపివేయాలని సీపీఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. ఈనెల 8న హైదరాబాద్ ఇందిరా పార్క్ ధర్నా చౌక్ వద్ద చేపట్టనున్న ధర్నా పోస్టర్లను వరంగల్ హెడ్ పోస్టాఫీస్ సెంటర్‌లో బుధవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా పార్టీ నేత రాచర్ల బాలరాజు మాట్లాడుతూ ఆపరేషన్ కగార్ పేరుతో మధ్యభారతంలోని ఆదివాసీ జాతి ప్రజలపై కేంద్ర, రాష్ట్ర బీజేపీ ప్రభుత్వాలు చేస్తున్న హత్యాకాండను ప్రతిఒక్కరూ ఖండించాలని కోరారు. కార్యక్రమంలో న్యూ డెమోక్రసీ నాయకులు గంగుల దయాకర్, ఎలకంటి రాజేందర్, బండి కోటేశ్వరరావు, బన్న నరసింగం, మన్నె కరుణాకర్, ఎండీ.అక్బర్, బండి చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఈఎంటీ దినోత్సవం

ఖిలా వరంగల్: వరంగల్ కరీమాబాద్‌లో 108 అంబులెన్స్ కార్యాలయంలో ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ (ఈఎంటీ) దినోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సిబ్బంది కేక్ కట్ చేసి సంబురాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో 108 ప్రోగ్రాం మేనేజర్ శివకుమార్, ఈఎంఈ రాజకుమార్, ఈఎంటీ కర్ణాకర్, బాలు, కిరణ్, కమలాకర్, సదానందం, రవి, శ్యామ్ పాల్గొన్నారు.

సన్న బియ్యం పంపిణీ

నగర వ్యాప్తంగా రేషన్ షాపుల్లో సన్న బియ్యం పంపిణీ చేశారు. ఈమేరకు ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్ని కార్యక్రమాలను బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేదల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పాటుపడుతోందని అన్నారు.

– సాక్షి నెట్‌వర్క్



మామునూరులో సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నాగరాజు



భీమారంలో కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఆర్డీఓ రమేష్ రాథోడ్



హన్మకొండ: వికాస్‌నగర్‌లో..



44వ డివిజన్ పరిధిలో కార్పొరేటర్ రాజు..



న్యూశాయంపేటలో క్యూ కట్టిన ప్రజలు

సర్వాయి పాపన్న జీవితం ఆదర్శం



హన్మకొండ అర్బన్: నివాళులర్పిస్తున్న అధికారులు

హన్మకొండ అర్బన్: సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ జీవితం అందరికి ఆదర్శనీయమని, బహుజనుల కోసం పోరాడిన గొప్ప వ్యక్తి పాపన్నగౌడ్ అని డీఆర్ఓ వైవీ.గణేష్ అన్నారు. పాపన్నగౌడ్ వర్ధంతి సందర్భంగా హనుమకొండ జిల్లా బీసీ వెల్ఫేర్ డీడీ రాంరెడ్డి ఆధ్వర్యంలో హనుమకొండ కలెక్టరేట్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో సర్వాయి పాపన్న గౌడ్ చిత్రపటానికి అధికారులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆ కార్యక్రమంలో డీఆర్‌డీఓ మేన శ్రీను, డీటీఓ డీడీ శ్రీనివాస్ కుమార్, జెడ్పీ సీఈఓ విద్యాలత, అధికారులు జిల్లా గౌడ సంఘం ప్రతినిధులు, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.



సర్దార్ సర్వాయి పాపన్న చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

బహుజన వీరుడు పాపన్న

హన్మకొండ: బహుజన వీరుడు, ఓరుగల్లు పోరుబిడ్డ సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్ అన్నారు. బాలసముద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో పాపన్న గౌడ్ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా పాపన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో బొంగు అశోక్ యాదవ్, సోదా కిరణ్, జోరిక రమేష్, జనార్ధన్ గౌడ్, పులి రజినీకాంత్, సల్వాజీ రవీందర్ రావు, ఇమ్మడి లోహిత, రాజు, పున్నం చందర్, రఘు, ఖలీల్, శ్రీనివాస్, రాజు, వసంత్, దేవమ్మ, సంపత్, రామ్మూర్తి పాల్గొన్నారు.

'అంబేడ్కర్‌ను అగౌరవపర్చిన బీజేపీ'



ర్యాలీ నిర్వహిస్తున్న ఎమ్మెల్యే, నాయకులు

కాజీపేట: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్.అంబేడ్కర్‌ను అగౌరవ పర్చడమే కాకుండా దేశంలోని ప్రజాస్వామ్య వ్యవస్థలను బీజేపీ ప్రభుత్వం నాశనం చేస్తోందని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి విమర్శించారు. జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ అనే నినాదంతో చేపట్టిన ర్యాలీని కాజీపేట పట్టణంలో బుధవారం ప్రారంభించారు. కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలతో కలిసి పుర వీధుల్లో ప్రదర్శన నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అంబేడ్కర్ ఆలోచనలను కాపాడుకుంటూ ముందుకు సాగడానికి నేటి యువత సిద్ధంగా ఉండాలని కోరారు. సమావేశంలో కార్పొరేటర్లు జక్కుల రవీందర్ యాదవ్, విజయశ్రీ రజాలీ, తోట వెంకటేశ్వర్లు, మాజీ కార్పొరేటర్లు ఎండీ.అబుబక్కర్, సుంచు అశోక్, గుంటి కుమార్, జిల్లా అధికార ప్రతినిధి ఎండీ.అంకూస్, అజ్గర్, పి.ఆంజనేయులు, తమ్మిడి మానస, నాగపురి లలిత, అరూరి సాంబయ్య, సిరిల్ లారెన్స్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

లారీ ఓనర్లకు న్యాయం చేయాలి

ఖిలా వరంగల్: కొన్ని లారీలకు మాత్రమే లోడింగ్ ఇచ్చి, 250 మంది లారీ ఓనర్లకు లోడింగ్ ఇవ్వకుండా ఇబ్బంది పెట్టడం సరికాదని ఓరుగల్లు లారీ ఓనర్స్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు ఎండీ.ఫెరోజ్ అన్నారు. వరంగల్ – నర్సంపేట రోడ్డులోని ఓరుగల్లు లారీ ఓనర్స్ అసోసియేషన్ కార్యాలయంలో బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తొమ్మిది నెలల క్రితం పాలకవర్గ పదవీకాలం ముగిసిందని, అడ్‌హక్ కమిటీ ఏర్పాటు చేయకుండా కాలయాపన చేయడం సరికాదని అన్నారు. 20 మంది లారీ ఓనర్లకు మాత్రమే లోడింగ్ ఇచ్చి, 250 మందికి గూడ్స్ షెడ్ నిర్వాహకులు లోడింగ్ ఇవ్వకపోవడం బాధాకరమని వాపోయారు. అనంతరం నర్సంపేట రోడ్డుపై లారీ ఓనర్లు ధర్నా నిర్వహించారు.

మజ్జిగ, పండ్లు, పులిహోర పంపిణీ

వరంగల్ చౌరస్తా: వేసవి ఎండల దృష్ట్యా ప్రజలకు ఆర్యవైశ్య మహాసభ వరంగల్ జిల్లా ఆధ్వర్యంలో బుధవారం పులిహోర, అరటిపళ్లు, మజ్జిగ పంపిణీ చేశారు. ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు దుబ్బ శ్రీనివాస్ నేతృత్వంలో ప్రతినెలా మూడు దఫాలుగా అన్నదాన కార్యక్రమాలు చేపడుతున్నట్లు నాయకులు వెల్లడించారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి గార్లపాటి నాగేంద్రబాబు, కోశాధికారి గందె శ్రీనివాస్ గుప్తా, రాష్ట్ర కార్యదర్శి వంగేటి అశోక్ కుమార్, వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ సెక్రటరీ గార్లపాటి శ్రీనివాస్, రాజకీయ విభాగం చైర్మన్ పొట్టి శ్రీనివాస్, మహిళా విభాగం అధ్యక్షురాలు చొల్లేటి కళావతి, ప్రధాన కార్యదర్శి గార్లపాటి శ్రీలత, కోశాధికారి రాజమణి అడ్మినిస్ట్రేషన్ సెక్రటరీ సుప్రియ, ప్రతినిధులు ఓలం, సదాశివుడు, అల్లాడి బద్రి, సామ అశోక్, శ్రీరామ్ రవీందర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పెన్షనర్లపై కేంద్రం పక్షపాత వైఖరి

వరంగల్: పెన్షనర్లపై కేంద్ర ప్రభుత్వం పక్షపాత వైఖరి అవలంబిస్తోందని స్టేట్ గవర్నమెంట్ పెన్షనర్స్ అసోసియేషన్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఏ.రాజేంద్రబాబు, ప్రధాన కార్యదర్శి ఎంవీ.నర్సింగ్‌రావు, ఉపాధ్యక్షుడు వెలిశోజు రామమనోహర్, ఆర్థిక కార్యదర్శి బి.నర్సయ్య ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. జనవరి నెలలో ఇవ్వాల్సిన ఒక విడత కరువు భత్యం ఆలస్యంగా ప్రకటించిందని సంతోషించాలో లేక ఇక తమకు నూతన వేతన సవరణ సంఘం సిఫార్సులు వర్తించవని కేంద్ర ప్రభుత్వం చావు కబురు చల్లగా చెప్పిందని బాధపడాలో తెలియడం లేదని పేర్కొన్నారు. పెన్షనర్ల ప్రయోజనాలకు హాని కలిగించే కేంద్ర ప్రభుత్వ చట్టానికి రాష్ట్ర ప్రభుత్వం తన అసమ్మతిని తెలపాలని ప్రకటనలో కోరారు.

ఘనంగా గ్రాడ్యుయేషన్ డే

కాజీపేట: కాజీపేట మండలం సోమిడి గ్రామ శివారులోని తాళ్ల పద్మావతి ఒలింపియాడ్ పాఠశాలలో గ్రాడ్యుయేషన్ డే వేడుకలను తాళ్ల విద్యాసంస్థల చైర్మన్ తాళ్ల మల్లేశం బుధవారం ప్రారంభించారు. యూకేజీ నుంచి ఒకటో తరగతిలోకి, 5 నుంచి 6వ తరగతిలోకి అడుగిడుతున్న విద్యార్థులు వేడుకల్లో పాల్గొని ఆట, పాటలతో అలరించారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ తాళ్ల వంశీ మాట్లాడుతూ వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, రోబోటిక్స్ పాఠ్యాంశాలను పరిచయం చేయనున్నట్లు ప్రకటించారు. కార్యక్రమంలో డైరెక్టర్ తాళ్ల చైతన్య, కోఆర్డినేటర్ అఫ్జలున్నీసాతో పాటు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

కేయూ డిగ్రీ పరీక్షల ఫీజు గడువు పొడిగించాలి

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని డిగ్రీ కోర్సుల 2, 4, 6వ సెమిస్టర్ పరీక్షల ఫీజు గడువు పొడిగించాలని పీడీఎస్‌యూ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు రంజిత్‌కుమార్, కార్యదర్శి వంశీకృష్ణ, బాధ్యులు కోరారు. ఈమేరకు కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ రామచంద్రంకు బుధవారం వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో రాజు, అన్వేష్, ప్రేమ్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

పేకాట ఆడుతున్న ఏడుగురి అరెస్ట్

కాజీపేట: కాజీపేట 61వ డివిజన్ సిద్ధార్థనగర్ కాలనీలోని ఓ దుకాణంలో పేకాట ఆడుతున్న ఏడుగురు వ్యక్తులను టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి రూ.27,950 నగదు, ఏడు సెల్‌ఫోన్లు, స్కోర్ షీట్‌ను స్వాధీనం చేసుకున్నట్లు ఏసీపీ మధుసూదన్ తెలిపారు. వారిని కాజీపేట పోలీసులకు అప్పగించగా, కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నట్లు ఏసీపీ వివరించారు.

మానవ అక్రమ రవాణా చట్టరీత్యా నేరం

వరంగల్ క్రైం: మానవ అక్రమ రవాణా చట్టరీత్యా నేరమని సుబేదారి ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ రెడ్డి అన్నారు. సుబేదారి పోలీస్ స్టేషన్ పరిధి హంటర్ రోడ్డులోని న్యూసైన్స్ కళాశాల విద్యార్థులకు యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ విభాగం, పోలీస్ కళాబృందం ఆధ్వర్యంలో బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ చిన్నారులతో ఎలాంటి పనులు చేయించరాదని అన్నారు. అలాంటి వారిని పనుల్లో పెట్టుకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు.

బాలల గ్రంథాలయానికి పుస్తకాల వితరణ



హన్మకొండ చౌరస్తా: అంతర్జాతీయ బాలల పుస్తక దినోత్సవాన్ని పురస్కరించుకుని హనుమకొండ పబ్లిక్ గార్డెన్‌లోని బాలల గ్రంథాలయానికి పుస్తకాలను ఉపాధ్యాయురాలు వెలిదండి సుమలత వితరణ చేశారు. ఈమేరకు లైబ్రేరియన్ గడ్డం సమ్మయ్యకు బుధవారం అందజేశారు. పిల్లల్లో పఠనాసక్తి పెంపు, బాలసాహిత్యం వైపు ఆకర్షించడం కోసం 1967నుంచి ప్రతిఏటా ఏప్రిల్ 2 నుంచి బాలల పుస్తక దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు సుమలత తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్రపతి అవార్డు గ్రహీత పరికిపండ్ల వేణు, డీబీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మాదాసి సురేష్, చుంచు రాజేందర్, కలకోటి మహేందర్, గొడిశాల హరినాథ్, చుంచు నరేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆమోదంతోనే కమిటీని ఎన్నుకుంటాం



వరంగల్: అందరి ఆమోదంతోనే వరంగల్ లక్ష్మీపురం మోడల్ మార్కెట్‌లోని వరంగల్ కమీషన్ వ్యాపారుల వర్తక సంఘం నూతన కమిటీ ఏర్పాటు చేసుకుంటామని స్థానిక కార్పొరేటర్ చింతాకుల అనిల్‌కుమార్ అన్నారు. కూరగాయల మార్కెట్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎంతో గుర్తింపు పొందిన లక్ష్మీపురం కూరగాయల మార్కెట్‌లో వేలాది మంది ఉపాధి పొందుతున్నారని అన్నారు. మంత్రి కొండా సురేఖ, మాజీ ఎమ్మెల్సీ మురళీధర్‌రావు ఆదేశానుసారం నూతన కమిటీ ఏర్పాటు చేసుకోవాలని నిర్ణయించినట్లు వివరించారు. మార్కెట్‌లో టెండర్ల నిర్వహణతో వచ్చిన డబ్బుల్లో ఎలాంటి గోల్‌మాల్ జరగలేదని అన్నారు. సమావేశంలో కార్పొరేటర్ సోమిశెట్టి ప్రవీణ్, కూరగాయల మార్కెట్ మాజీ అధ్యక్షుడు జారతి శ్రీనివాస్, కమీషన్ వ్యాపారులు పాల్గొన్నారు.

ఎగ్ కార్ట్‌తో నిరుద్యోగులకు ఉపాధి



ఖిలా వరంగల్: వరంగల్ 39వ డివిజన్ జన్మభూమి జంక్షన్‌లో ఎర్రబెల్లి ప్రదీప్‌రావు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బుధవారం ఎగ్ కార్ట్ ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిథిగా బీజేపీ నేత ఎర్రబెల్లి ప్రదీప్‌రావు సతీమణి ఎర్రబెల్లి రేణుక హాజరై బీజేపీ మండల అధ్యక్షుడు బోరిగం నాగరాజుతో కలిసి ఎగ్‌కార్ట్‌ను ప్రారంభించి మాట్లాడారు. పేదలకు అండగా ఉంటూ వారి జీవితాల్లో వెలుగులు నింపేందుకు ఎగ్ కార్ట్‌లు అందజేసి ఉపాధి చూపుతున్నట్లు వివరించారు. కార్యక్రమంలో కర్నె రవీందర్, ఆకుతోట రాజు, మహేష్, రాజు తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌సీయూ భూములను రక్షించాలి



హనుమకొండలోని రాంనగర్‌లో మంత్రి కొండా సురేఖ ఇంటివద్దకు ర్యాలీగా వెళ్తున్న వివిధ విద్యార్థి సంఘాల బాధ్యులు



కేయూలో దిష్టిబొమ్మను దహనం చేస్తున్న ఏబీఎస్ఎఫ్ నాయకులు